

నూతన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని గసభ పంచాయతీలో నూతనంగా మంజూరైన 21 మంది లబ్ధిదారులకు ఆ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి సునీత గురువారం లబ్ధిదారులకు పింఛన్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ పింఛన్లను సద్వినియోగ పరచుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఎంపిటిసి వి జేమ్మ , మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, ఉప సర్పంచ్ మహాదేవ్, వార్డ్ సభ్యులు సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



పింఛను అందజేస్తున్న సర్పంచ్

ఆ హామీ ఏమైంది...

- -విశ్వసనీయత అంటే ఇదేనా?
- -ఉద్యోగులు గోడు పట్టించుకోని సిఎం జగన్
- -ఒపిఎస్ అమలు చేయాల్సిందే
- -జిపిఎస్‌కు మంత్రివర్గం ఆమోదం సరికాదు
- - ఉపాధ్యాయ సంఘాల నేతలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: కాంట్రిబ్యూటరీ పింఛన్ పథకం (సిపిఎస్) ఉద్యోగులకు ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కి గ్యారంటీ పింఛను పథకం (జిపిఎస్) పేరిట ఉద్యోగులను మోసం చేసేందుకు వైసిపి ప్రభుత్వం సిద్ధమైంది. జిపిఎస్ అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలపడాన్ని ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ మాత్రమే అమలు చేయాలని అల్లూరి జిల్లా ఏజెన్సీ వ్యాప్తంగా ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. సిపిఎస్ రద్దు చేసి పాత పింఛను పథకం తీసుకొస్తామని ప్రతిపక్ష నేతగా ప్రతి సభలోను జగన్ చెప్పారు. సిపిఎస్ ను రద్దు చేసి, తమకిచ్చిన మాటను నిలబెట్టుకోవాలంటూ ఉద్యోగ లోకం నాలుగున్నరేళ్లుగా గొంతెత్తి నినదిస్తోంది. ఒపిఎస్ అమలు చేయాలని కోరుతూ ఉద్యోగులు చేస్తున్న పోరాటాలను జగన్ సర్కారు కనీసం పట్టించుకోలేదు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ దాన్ని నెరవేర్చక పోగా ఉద్యోగులు వద్దు అంటున్న ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జిపిఎస్ అమలు చేసేందుకు ప్రభుత్వం మొండిగా ముందుకెళుతోంది. పాత పెన్షన్ పై ఉద్యోగులకు మాట ఇచ్చి సిపిఎస్ రద్దు చేయకపోగా వాటి స్థానంలో తీసుకొచ్చిన జిపిఎస్ కు మంత్రి వర్గం ఆమోదాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. దీనిపై సిపిఎస్ ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వద్ధాప్యంలో ఆసరా ఇచ్చే ఒపిఎస్ ను ఉద్యోగులకు దూరం చేసి జగన్ సర్కార్ జిపిఎస్ అమలుకు సిద్ధం కావడం సిపిఎస్ ఉద్యోగులకు తీవ్రంగా దెబ్బ కొట్టడంతో పాటు ఉద్యోగులు కోరే ఒపిఎస్ కు పాతర వేయడమే. దీంతో ఒపిఎస్ కోసం ఆశతో ఎదురుచూస్తున్న ఉద్యోగులు వైసిపి ప్రభుత్వం తీరుతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఒపిఎస్ విధానం ప్రకారం ఉద్యోగి తన చివరి జీతంలో సగం మొత్తాన్ని పెన్షన్ గా పొందుతారు. అలాంటి పాత పింఛను ఉద్యోగులకు దూరం చేసి నిరాశ్రయుల్ని చేయొద్దని వేడుకుంటున్నారు. అందుకే ఇచ్చిన మాట ప్రకారం సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాల్సిందేనని తేల్చి చెబుతున్నారు. ఉద్యోగులెవరికీ ఇష్టం లేకున్నా జిపిఎస్ అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలపడాన్ని ఆక్షేపణలు వ్యక్తం అవుతున్నాయి. ఎపి అమలు చేసే జిపిఎస్ దేశానికి ఆదర్శమని చెబుతున్న ప్రభుత్వం ఒపిఎస్ అమలు చేస్తున్న రాష్ట్రాలకు దేనికి ఆదర్శమో చెప్పాలని అంటున్నారు. జిపిఎస్ లో ఒపిఎస్ కంటే ఎక్కువ ప్రయోజనాలు ఉన్నాయని చెబుతున్న ప్రభుత్వం..జిపిఎస్ బదులు ఒపిఎస్ నే అమలు చేయొచ్చు కదా? అని ప్రశ్నిస్తున్నారు. జగన్ హామీ ఇచ్చిన తర్వాత ఆరు రాష్ట్రాల్లో పాత పింఛను పునరుద్ధరించారని, ఎపిలో మాత్రం సాధ్యం కాదనడం ఉద్యోగులను మోసం చేయడం కాదా? అని ప్రశ్నిస్తున్నారు.

జిపిఎస్ గ్యారెంటీ లేని పెన్షన్

ఉద్యోగులు, ఉపాధ్యాయులు వద్దని చెబుతున్న జిపిఎస్ దుర్మార్గమైన విధానం. జిపిఎస్ అనేది గ్యారెంటీ లేని పెన్షన్ విధానం. ఉద్యోగులు వద్దని చెబుతున్న ప్రభుత్వం జిపిఎస్ అమలుకు మొండిగా పూనుకోవడం దారుణం. ఆయా రాష్ట్రాలు ఒపిఎస్ అమలుకు సిద్ధమైంది..ఎపిలో మాత్రం సిపిఎస్ కంటే నష్టదాయకమైన జిపిఎస్ అమలుకు సిద్ధమైంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఒపిఎస్ అమలుకు పునరాలోచించాలి. జిపిఎస్ అమలు చేయాలని ప్రయత్నిస్తే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. ముఖ్యమంత్రి జగన్ గెలిచిన తర్వాత మాటమార్చడం తగదు



వి.మహేశ్వరరావు
యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆందోళన తీవ్రం చేస్తాం

జిపిఎస్ అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలపడం రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్ర నిరాశకు చేస్తోంది. వృద్ధాప్యంలో ఆసరా ఇచ్చే పాత పింఛనును ఉద్యోగులకు దూరం చేసి నిరాశ్రయుల్ని చేయడమే. వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి నాలుగేళ్ల గడిచాక జిపిఎస్ అమలకు మంత్రివర్గం ఆమోదం తెలపడం ప్రభుత్వ విశ్వసనీయత దెబ్బతీసింది. ఈ నిర్ణయం ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచించడమే.



ఈశ్వరరావు
సిపిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

అన్ని రాష్ట్రాలలో అమలవుతున్న సిపిఎస్ రద్దు ఎపి రాష్ట్రంలో ఎందుకు సాధ్యం కాదు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల డిమాండ్‌ని పక్కన పెట్టి మరొక కొత్త విధానాన్ని తీసుకు రావడం, జిపిఎస్ అమలుకు సిద్ధమవడం ఉద్యోగులను మోసం చేయడమే కదా. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించక పోతే ఐక్య ఉద్యమాలు చెయ్యక తప్పదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించాలి.



వి.వెంకటరమణ
బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగులను మోసం

సిపిఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం నమ్మకద్రోహం చేసింది. సిపిఎస్ వారం రోజుల్లో రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక జిపిఎస్ పేరుతో ఉద్యోగులకు ఇంకా నష్టం కలిగేలా అత్యంత దుర్మార్గమైన విధానాన్ని తీసుకు వస్తున్నారు. సిపిఎస్ కంటే జిపిఎస్ తోనే ఉద్యోగులకు ఎక్కువ నష్టం. బలవంతంగా జిపిఎస్ అమలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ముఖ్యమంత్రి జగన్ గెలిచిన తర్వాత మోసం చేశారు.



ఆర్.జగన్ మోహాన్ రావు
ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఐటిడిఎ పిఒ ఆకస్మిక పర్యటన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ నిర్వహించిన ప్రత్యేక స్పందనలో మండల వైస్ ఎంపీపీ పాటు పోయి సత్యనారాయణ ఏకలవ్య భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై ఐటీడీఏ పీవో ఆకస్మికంగా గురువారం పర్యటించారు. మండలంలోని లబ్బూరులో నిర్మిస్తున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూలు నిర్మాణ పనులను ఐటిడిఏ పిఒ అభిషేక్ పరిశీలించారు. పనులను త్వరగా చేపట్టాలని గుత్తేదారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ, డిసెంబరు నెలాఖరు నాటికి ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూలు నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. గడువులోగా పనులన్ని పూర్తి చేసి భవనం అప్పగించాలని చెప్పారు. అనంతరం రావిడిపుట్టు గ్రామస్తులు రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామాన్ని సందర్శించారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం బంగారుమెట్ట గ్రామ సచివాలయం భవనం నిర్మాణపు పనులు పరిశీలించారు. ప్రాధాన్యత భవన నిర్మాణాలు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలనీ, వెంటనే బిల్లులు వెంటనే చెల్లించడం జరుగుతుందన్నారు. కిలగాడ పంచాయతీ రాయపల్లి గ్రామంలో నిర్మిస్తున్న అంగన్వాడీ భవన పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇఇ కె. వేణుగోపాల్, ఎఇఇ జబ్బర్ పాల్గొన్నారు.



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పిఒ




విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు జీవన్ కృష్ణ, కార్తీక్

అధికారుల నిర్లక్ష్యంతోనే గిరిజన విద్యార్థుల మృతి

- - మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పన ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- - తక్షణమే ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వాలంటీర్లను నియమించాలి
- - ఎస్ఎఫ్ఐ అల్లూరి జిల్లా అధ్యక్షులు జీవన్ కృష్ణ

ప్రజాశక్తి-కొయ్యూరు

ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు చనిపోవడానికి ప్రభుత్వం, ఐటిడిఎ అధికారుల నిర్లక్ష్యమే కారణమని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) అల్లూరి జిల్లా అధ్యక్షులు పాంగి జీవన్ కృష్ణ, నాయకులు కార్తీక్ పేర్కొన్నారు. కొయ్యూరు మండలం, యు.చీడిపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న కిల్లో వంశీకృష్ణ (8) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ బృందం గురువారం ఆ పాఠశాలను సందర్శించింది. విద్యార్థి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీవన్ కృష్ణ, కార్తీక్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థి చనిపోయి సుమారు పది రోజులవుతున్నా అధికారులు, పాలకులు నేటికీ స్పందించకపోవడం దారుణమన్నారు. పాడేరు ఐటిడిఎ పరిధిలోని 11 మండలాల్లో ఏ ఒక్క ఆశ్రమ పాఠశాలల్లోనూ హెల్త్ వాలంటీర్లు లేరని తెలిపారు. హెల్త్ వాలంటీర్లు లేకపోవడంతో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి పట్టించుకునే నాథుడే లేరన్నారు. గిరిజన విద్యార్థులంటే అంత చులకనా? గిరిజన విద్యార్థులవి ప్రాణాలు కావా? వార్డెన్లకు విద్యార్థుల బాధ్యత పట్టదా? అని ప్రశ్నించారు. ఈ మూడు నెలల్లోనే ఐదుగురు విద్యార్థులు మృత్యువాత పడ్డారన్నారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా విద్యార్థుల మృతిపై విచారణ చేపట్టాలని, ప్రతి పాఠశాలలో హెల్త్ అసిస్టెంట్‌ను నియమించాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

టార్గెట్‌గా ఉపాధి హామీ పనులు చేపట్టాలి

- ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలో ఉపాధి హామీ పనులు టార్గెట్ ప్రకారం చేయించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశపు హాలు నుండి రంపచోడవరం. చింతూరు డివిజన్ల పరిధిలోని 11 మండలాలకు సంబంధించిన ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో పిఒ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీ పరిధిలో ఎన్ని గ్రామాలలో ఉపాధి పనులు కల్పించింది, ఎంత మందికి జాబ్ కార్డులు ఉన్నవి, ఎంతమంది జనాభా ఉన్నదీ, సచివాలయల వారిగా ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు. ఉపాధి హామీ లబ్ధిదారులకు బ్యాంక్ అకౌంట్లు తప్పనిసరిగా ఉండాలని, ఆధార్ అనుసంధానం చేయించాలని సూచించారు. గంగవరం మండలంలోని ముకాస భూములకు సంబంధించిన వివరాలు సమర్పించాలని సంబంధిత ఏపీఓను ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. చింతూరు డివిజన్లోని నాలుగు మండలాలలో ఉపాధి హామీ పథకం పనులు చేయించడంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందికి ఈ నెల జీతం ఆపాలని ఏపీఓలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీడీలు రాంబాబు, భాగ్యరావు, ఉపేంద్ర, ఏపీవోలు సాయిబాబా, ప్రకాష్, సురేష్, రెడ్డి బాబు, ఎస్ఓ టి.మార్తమా, జి ఆనంద్, ఎపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

27 వరకు నైట్ సర్వీసు బస్సులు రద్దు

ప్రజాశక్తి -సీలేరు : మావోయిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు సందర్భంగా ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు విశాఖపట్నం ఆర్టీసీ అధికారులు నైట్ సర్వీస్ బస్సులను రద్దు చేశారు. మధురవాడ డిపో చెందిన రెండు నైట్ సర్వీసు బస్సులు, విశాఖపట్నం డిపోకు చెందిన సీలేరు నైట్ హాల్ట్ బస్సును మావోయిస్టు పార్టీ వారోత్సవాలు ముగిసే వరకు రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. భద్రాచలం వెళ్లే బస్సులు రద్దు కావడంతో ఈ వారం రోజులు ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురికానున్నారు. పగటిపూట తిరిగే ఆరకొర బస్సులతో ప్రయాణం చేయవలసిన పరిస్థితి నెలకొంది.

ఉమ్మడివరాన్ని పోలవరం ముంపు జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని ఉమ్మడివరం గ్రామాన్ని పోలవరం ముంపు గ్రామాల జాబితాలో వెంటనే చేర్చాలని సిపిఎం మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉమ్మడివరం గ్రామంలో గురువారం సిపిఎం గ్రామ శాఖ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ వరదలకు పూర్తిగా మునిగిన గ్రామాన్ని ఇప్పటివరకు ప్రభుత్వంగానీ, అధికారులు గానీ ముంపు గ్రామంగా గుర్తించక పోవడం అన్యాయమన్నారు. మొదటి కాంటూరులో ఉమ్మడివరం గ్రామాన్ని చేర్చి ఆ గ్రామానికి పునరావాసం, ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే చింతూరు ఐటిడిఎ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిసిఎం శాఖ కార్యదర్శి పోడియం శ్రీరామ్మూర్తి, నాయకులు చిక్కల రామారావు, శాఖ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సిపిఎం నాయకులు పూనెం సత్యనారాయణ, సోయం చిన్నబాబు, పార్టీ సభ్యులు

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు : నీతి ఆయోగ్ ఆకాంక్షాత్మక బ్లాక్ ఫెలో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఏదైనా పోస్టు గ్రాడ్యుయేషన్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.55 వేల నిర్దిష్టమైన వేతనంతో తాత్కాలిక ప్రాతిపధికన నియమించడం జరుగుతుందని స్పష్టం చేసారు. ఎంపికైన అభ్యర్థులు వై.రామ వరం, మారేడుమిల్లి, గంగవరం మండలాల్లో విధులు నిర్వహించవలసి ఉంటుందన్నారు. అర్హతలు , ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 28 వ తేదీలోపు కలెక్టర్ కార్యాలయం అల్లూరి సీతారామ రాజు జిల్లా, కుమ్మరిపుట్టు, పాడేరు మండలం లో ఉన్న జిల్లా అర్ధ గణాంక అధికారి కార్యాలయానికి పోస్టు ద్వారా గాని స్వయంగా గానికి దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

నేడు, రేపు ఎస్టీ కమిషన్ సభ్యులు పర్యటన

ప్రజాశక్తి-పాడేరు: జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు అనంతనాయక్ ఈనెల 22,23 తేదీల్లో పాడేరు ఏజెన్సీలో పర్యటిస్తారని ఐటిడి ఏ పి ఓ వి. అభిషేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక పిఎం ఆర్‌సి భవనంలో గిరిజన నేతలతో సమావేశమవుతారని చెప్పారు. పర్యటన వివరాలు: 22 వ తేదీన ఉదయం 9.30 గంటలకు విశాఖపట్నంలో బయలు దేరి 12 గంటలకు పాడేరు పి.ఎం. ఆర్.సి భవనానికి చేరుకుంటారు. 12.20 గంటలకు బయలుదేరి శ్రీకృష్ణాపురం బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శిస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన జిసిసి, కాఫీ, విడివికె స్టాల్స్‌ను సందర్శిస్తారు. గిరిజన రైతులకు అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేస్తారు. అనంతరం పాడేరు పిఎంఆర్‌సి భవనానికి చేరుకుంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక గిరిజన నేతలతో సమావేశమవుతారు. 2.30 గంటలకు బయలుదేరి మెడికల్ కళాశాల నిర్మాణపు పనులు పరిశీలిస్తారు. ఆతరువాత కుమ్మరిపుట్టు లో ఉన్న గురుకుల పాఠశాల, ఏకలవ్య పాఠశాలలను సందర్శిస్తారు. మ.3.45 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం పి.ఎం.ఆర్‌సి .భవనానికి చేరుకుని రాత్రి బస చేస్తారు.23న ఉదయం 8 గంటలకు బయలుదేరి మఠం గ్రామంలో ఉన్న వనవాసి కళ్యాణ ఆశ్రమంలో అల్పాహారం చేస్తారు. 9 గంటలకు బయలు దేరి గుత్తుల పుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల లేదా ఉప్ప గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శిస్తారు. అక్కడ నుండి బయలు దేరి డుంబ్రిగుడ ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూలు పాఠశాల భవన నిర్మాణాలను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 11.10 గంటలకు కిల్లోగుడ ఆశ్రమ పాఠశాల(ఇంగ్లీషు మీడియం)ను సందర్శిస్తారు. 11.45 గంటలకు పద్మాపురం గార్డెన్ చేరుకుంటారు. మ. 12.20 గంటలకు గిరిజన మ్యూజియంను సందర్శిస్తారు .మ. 1గంటకు అరకు వ్యాలీ ఎపిటిడిసికి చేరుకుని భోజనం అనంతరం విశాఖపట్నం బయలుదేరి వెళతారు.

గిరిజనేతరుడిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పాడేరు:29 సెంట్లు భూమిని ఆక్రమించుకొని అక్రమ కట్టడాలు చేస్తున్న గిరిజనేతరుడు పీల కృష్ణ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాడేరు మండలం చింతల వీధి పంచాయతీ కొత్త కుమ్మరి పట్టు గ్రామానికి చెందిన కూడ చిట్టిబాబు, చిన్నాలమ్మలు తమకు చెందిన 29 సెంట్లు భూమిని కొద్ది రోజులకు వినియోగించుటకు పశువుల గడ్డి పెట్టుకోవడానికి ఇచ్చారన్నారు. ఇదే అదునుగా భావించిన పీల కృష్ణ 29 సెంట్ల భూమి ఆక్రమించి దర్జాగా ఇల్లులు, షెడ్లు కట్టుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో విచారణ జరుగుతున్న క్రమంలో, కూడా లెక్క చేయకుండా మరోవైపు దర్జాగా ఇల్లు షెడ్డు కడుతున్నారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా గురజాడ జయంతి





గురజాడ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, మాట్లాడుతున్న శారదా స్కూల్ హెచ్ఎం

ప్రజాశక్తి-పాడేరు

గురజాడ అప్పారావు ఆశయాలను ఆచరిస్తూ ముందుకు తీసుకెళ్లాల్సి ఉందని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.చిన్నారావు పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు 161 వ జయంతినీ పాడేరులోని లక్ష్మి ప్రసన్న జూనియర్ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం సమాజాన్ని వెనక్కి తీసుకువెళ్లేవాళ్లు, మహిళలను గౌరవించని వారు, మతాల మధ్య మంటలు పెట్టేవాళ్ళు దేశాన్ని పరిపాలిస్తున్నారని అన్నారు. దేశంలో నూతన విద్యా విధానం తీసుకొచ్చి విద్యను మతోన్మాద కాషాయీకరణ చేయాలని ప్రయత్నం చూస్తుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో గల ఆశ్రమ పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేసారు. ముందుగా గురజాడ చిత్రపటానికి విద్యార్థులంతా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మత్యరాజు, సింహాద్రి, ప్రేమ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్ : మండలంలోని శారదా నికేతన్ స్కూల్లో గురజాడ అప్పారావు 161 వ ఘనంగా నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు చిరంజీవి అన్నారు. గురువారం స్కూల్ ఆవరణలో గురుజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా వాళులర్పించారు.ప్రధానోపా ధ్యాయుడు చిరంజీవి మాట్లాడుతూ. తన రచనలు ద్వారా సమాజంలో పరివర్తన తీసుకొచ్చిన మహనీయులు గురజాడ అప్పారావు అని కొనియాడారు. ఆనాటి సమాజంలో సామాజిక అసమానతల పై గురజాడ చేసిన కృషి మరవలేనిదని గుర్తుచేశారు. గురజాడ వాడుక భాష లో ఎన్నో రచనలు, ఆయన సేవలు నేటికీ మనకు ఆదర్శమని ఆయన పేర్కొన్నారు.ఆయన అద్భుత రచనల్లో కన్యాశుల్కం అత్యంత ఆదరణ పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి,నాగలక్ష్మి, కృష్ణ కుమారి, కుమారి, విజయకుమార్, సంధ్య, ధనురాజన్‌రావు పాల్గొన్నారు.

చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురజాడ వెంకట అప్పారావు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం మాట్లాడుతూ గురజాడ అప్పారావు సాహితీవేత్తగా మిగిలిపోలేదని, గొప్ప సంఘ సంస్కర్తగా నిలిచారని తెలిపారు. తెలుగు భాష ఉన్నంత వరకు గురజాడ జీవించి ఉంటారన్నారు. ఆధునిక మహిళకు నిర్వచనం చెప్పిన వ్యక్తి గురజాడ అని పేర్కొన్నారు. తెలుగు విభాగాధిపతి కె.శ్రీదేవి, మాట్లాడుతూ తన రచనల ద్వారా సామాజిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి గురజాడ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎమ్.శేఖర్, అధ్యాపకులు జి.వెంకట్రావు, కె.శకుంతల, జి.హారతి, ఎస్.అప్పనమ్మ, కె.శైలజ, సిహెచ్.రాజబాబు, కె.శ్రీలక్ష్మి, ఆర్.మౌనిక, పి.గౌతమి, జి.సాయికుమార్, పి.ఏడుకొండలు, పి.అలివేలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొయ్యూరు : స్థానిక ప్రభుత్వం మహిళా డిగ్రీ కళాశాలలో గురజాడ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ హరున్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురజాడ సాంఘిక దురాచాలపై తన కలాన్ని ఎక్కుపెట్టారన్నారు. గురజాడ దేశభక్తి గేయం ఎల్లలు లేని విశ్వమానవ ప్రేమను చాటే మహోన్నత గేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణ, శ్రీనివాస్, రాజబాబు, సౌమిత్ర, రమణమ్మ, లవరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



గురజాడ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

గంజాయి అక్రమ రవాణాపై పోలీసు నిఘా

ప్రజాశక్తి -సీలేరు : గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు నిఘా ఉధృతం చేశారు. స్థానిక ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. స్థానిక లాడ్జిల్లో ఎవరెవరు మకాం వేస్తున్నారా? అనే దానిపై ఆరా తీస్తున్నారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు నుంచి గంజాయి అక్రమ రవాణా తరచూ జరుగుతుండడంతో ప్రత్యేక దృష్టి సారించారు. గంజాయి స్మగ్లర్ల కదిలికలపైనా, వారికి సహకరిస్తున్న వారిపైనా నిఘా ఉంచారు. రెండు రోజుల క్రితం ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు నుంచి రెండు కోట్లు విలువైన గంజాయి సినీ పక్కిలో తరలిస్తుండగా, పోలీసులు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. గంజాయి సూత్రధారులు ఎవరు అనే కోణంలో ఆంధ్ర ఒరిస్సా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలోనే స్థానిక ఎస్ఐ రామకృష్ణ సిఆర్పిఎఫ్, సివిల్ పోలీసులతో ప్రధాన రహదారులు సీలేరు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు.



సీలేరు పరిసరాల్లో పహారా కాస్తున్న పోలీసులు


ర్యాలీలో పాల్గొన్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

పెదబయలు ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

ఆదివాసీ గిరిజన సంఘం ర్యాలీ

ప్రజాశక్తి- పెదబయలు: మండలం లక్ష్మీపేట పంచాయితీ మొండికోట గ్రామానికి చెందిన కిండై విజయ్ కుమార్‌పై దాడి చేసిన ఎస్సై మనోజ్ కుమార్, జీవో గుత్తేదారులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మండల కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం నిరసన ర్యాలీ చేపట్టింది. ఈ సందర్భంగా గిరిజన సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ, లక్ష్మీపేట పంచాయితీ మొండికోట గ్రామంలో జియో టవర్ నిర్మాణానికి స్థలం ఇవ్వనందుకు విజయ్ కుమార్ పై స్థానిక పెదబయలు ఎస్సై పులి మనోజ్ కుమార్, గుత్తేదారులు కలిసి దాడికి పూనుకున్నారన్నారు. నానా రకాల దుర్భాషలాడుతూ ఈడ్చుకొని వెళ్లి దాడి చేశారన్నారు. స్థలం ఇవ్వకపోతే గంజాయి కేసు పెడతానని ఎస్సై బెదిరించారని తెలిపారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్, అల్లూరి జిల్లా ఎస్పీలకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎస్సైని వెనకేసుకుని వస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం గిరిజనులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేసీసీ రాష్ట్ర నాయకులు పోతురాజు, జెండా లోహిదాసు, మండల అధ్యక్ష కార్యదర్శులు బొండా గంగాధరం, కె.శర్వన్న, లక్ష్మీపేట మాజీ వైస్ సర్పంచ్ ఎం అప్పలనాయుడు, ఏబీవీపీ నాయకులు అల్లంగి మహేష్, ఆనంద్, టిడిపి నాయకులు బత్తిరి రామారావు, మహేష్ పాల్గొన్నారు.

వాజంగిలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని పినకోట పంచాయతీ వాజంగి గ్రామంలో ప్రత్యేక పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వ్యాధి బారిన పడిన పశువులకు కాళీపట్నం పశువైద్య అధికారి సాగిని గణేశ్వరరావు ఆధ్వర్యంలో లంపి చర్మ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. అనంతరం పశువులకు సోకే వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించా మని ఆయన పేర్కొన్నారు. వ శువులు అనారోగ్యానికి గురైతే తక్షణమే సచివాలయ పశుసంవర్ధక సహాయకులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ పశుసంవర్ధక సహాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు .


టీకాలు వేస్తున్న వైద్యాధికారి

నేడు 'జగనన్నకు చెబుదాం' రద్దు

ప్రజాశక్తి-పాడేరు: ఈనెల 22 శుక్రవారం పెదబయలు మండల కేంద్రంలో నిర్వహించనున్న జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందనను రద్దు చేసామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అనివార్య కారణాల వల్ల ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. జాతీయ షెడ్యూలు తెగల కమిషన్ సభ్యులు అనంత నాయక్ పర్యటన ఉన్నందున స్పందన కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ మార్పును గమనించి అర్జీదారులు స్పందనకు రావద్దని కోరారు.

ఉపాధి హామీ పనులపై ఆడిట్


ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2022-23 వరకు కేటాయించిన నిధులతో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం ఈనెల 8వ తేదీ నుండి 21 తేదీ వరకు మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో సోషల్ ఆడిట్ నిర్వహించి గ్రామసభలను నిర్వహించారు. సోషల్ ఆడిట్ లో వచ్చిన సమస్యలపై గురువారం అరకులోయ మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక భవనంలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తనిఖీ బృందం వివిధ గ్రామాలలో నిర్వహించిన ఆడిట్లో వచ్చిన వాటిని చదివి వినిపించారు. జాతీయ ఉపాధి పథకం కింద వివిధ అభివృద్ధి పనులకు సుమారు 25 కోట్ల 10 లక్షలు కేటాయించారు. పనులు నిమిత్తం పంచాయితీరాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నుండి రోడ్డు, చెక్ డ్యాం వివిధ పనుల కోసం మెటీరియల్ 3 కోట్ల 99 లక్షలు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. పనులు నాణ్యత, పనులు వేగవంతం పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అడిషనల్ పిడి గిరిబాబు మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో ఉపాధి పనులను ఎంపీడీవో, ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు పనులు పర్యవేక్షించి పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉషారాణి, జెడ్పీటీసీ శెట్టి రోషిని, ఎంపిడిఒ సగేష్, ఎపిడి అరకు క్లస్టర్ పవన్ కుమార్, ఎస్ఆర్పి కనకరావు ఏ పి ఓ, జగదీష్, ఈసీ జగదీష్ ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


రాజవొమ్మంగిలో పోషకాహార ఉత్సవాల్లో పాల్గొన్న గర్భిణులు, బాలింతలు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజవొమ్మంగి: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని స్థానిక ఐసిడిఎస్ సిడిపిఒ దేవమణి అన్నారు. రాజవొమ్మంగి ఐసిడిఎస్ పరిధిలో రాజవొమ్మంగి అంగన్వాడీ కేంద్రం-4లో జాతీయ పోషకాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. తొలిత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ పి.అరుణలత, అంగనవాడీ కార్యకర్తలు వెంకటలక్ష్మి, ఎర్రయ్యమ్మ, కుమారి, నూకరత్నం, రమణి, సుందరమ్మ, రాజేశ్వరి, సర్వవేణి, గౌరీ పార్వతి, గెడ్డమ్మ వరలక్ష్మి వరలక్ష్మి, లక్ష్మీ విజోపేటా, పాల్గొన్నారు.

మారేడుమిల్లి : పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని మారేడుమిల్లి ఐసిడిఎస్ సిడిపిఒ ఎస్.ప్రసన్న విశ్వనాథ తెలిపారు. స్థానిక అంగన్వాడీ కేంద్రంలో గురువారం జాతీయ పోషకాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మోహన్ జాకబ్, జెడ్పిటిసి గొర్లె బాలాజీబాబు, సూపర్వైజర్లు కె.సత్యనారాయణమ్మ, సిహెచ్ చిన్నసీత, కె.లక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్ ఎస్.ప్రశాంతి, కె. స్వరూప, జి.చిరంజీవి, పి.హైమావతి, కె.మంగ, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెదబయలురూరల్: మండలం కేంద్రంలో శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి ఎం. రాజేశ్వరి ఆధ్వర్యంలో పోషణ మహోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ఎంపిడిఒ ఎల్.పూర్ణయ్య, ఎంపిపి బి.వరహాలమ్మ వైస్ ఎంపి పి కొర్రా రాజు బాబులు ఐసిడిఎస్ ద్వారా అందిస్తున్న పోషక ఆహారం వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సింహాచలం, రాజేశ్వరి, అంగనివాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టవర్-సిలో వినాయక చవితి వేడుకలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : సీతమ్మధార ఎఎమ్ హాస్పిటల్ వెనుక టవర్-సి అపార్ట్‌మెంట్‌లో 4వ వార్షికోత్సవ, వినాయక చవితి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. రూ.1, రూ.10, రూ.20 నోట్లతో వినాయకుని అలంకరించారు. ఈ వేడుకలలో భాగంగా చిన్నారులకు వినాయకుని గురించి వ్యాసరచన, పెయింటింగ్, పాటలు, వినాయకుని ప్రతిమల తయారీ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పూజలలో భాగంగా మహిళలు కుంకుమ పూజ, దీపారాధన, గరిక పూజ, లక్ష్మీ గణపతి హోమం, అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో చివరిగా లడ్డు వేలం, కరెన్సీ వేలం నిర్వహించారు. తదుపరి సాగర తీరాన నిమజ్జనం చేసినట్లు టవర్-సి అపార్ట్‌మెంట్ కల్చరల్ కమిటీ సభ్యులు తెలిపారు.


వేడుకల్లో పాల్గొన్న శ్రీ విష్ణు మీడియా సుబ్రహ్మణ్యం, తదితరులు


గెడ్డలో అర్ధనగ్నంగా నిరసన చేపడుతున్న టిడిపి నేతలు

టిడిపి నేతల వినూత్న నిరసన

ప్రజాశక్తి-యంత్రాంగం

హుకుంపేట: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుపై టిడిపి నేతలు నిరసన తెలిపారు. అరకు పార్లమెంట్ టి.ఎన్.ఎస్.ఎఫ్ అధ్యక్షులు తామర్ల సత్యనారాయణ ఆధ్వర్యాన గురువారం అండిబ పంచాయతి గెడ్డలో అర్ద నగ్నంగా కళ్ళకు నల్ల రిబ్బన్లు కట్టి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతో జగన్ రెడ్డి ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. "స్కిల్" స్కామ్ కేసులో చంద్రబాబు నాయుడు పేరే లేదని, ఆకస్మాత్తుగా అరెస్టు చేయడం వెనుక ఆంతర్యం ఏమిటో ప్రభుత్వమే చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే గొంతులను నొక్కేయాలని, ప్రతిపక్షం లేకుండా చేయాలన్నదే జగన్ రెడ్డి ప్రధాన ఉద్దేశమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో శివ, రాము, విశ్వనాథం, రవి, సింహాద్రి, రవికుమార్, బాలేష్,సాయి, సిసింద్రీ పాల్గొన్నారు.

చింతూరు : టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ చింతూరు మండల కేంద్రంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 9వ రోజు గురువారం కూడా కొనసాగాయి. విఆర్ పురం జెడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి, ముత్యాల రామారావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దీక్షల్లో ఆ మండల టిడిపి నాయకులు ఈళ్ళ చిన్నారెడ్డి, సురేష్ చౌదరి, బురక కన్నారావు, వెంకటేశ్వర్లు, అకోజు భాగ్యలక్ష్మి, ముత్యాల రమేష్, పాయం రామారావు, పెందుర్తి సుదర్శన్ రావు, బురక సారయ్య, కారం సీరమయ్య, సవలం రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటి వద్దే హోల్టర్, ఎపిబిఎం టెస్టులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : అంతర్జాతీయ ఆరోగ్య సంరక్షణ, అవుట్ సోర్సింగ్ అందించే మార్గదర్శక సంస్థ కార్డియాక్ రిథమ్ మానిటరింగ్‌లో ప్రత్యేకత కలిగిన హెల్త్ వాచ్ టెలీ డయాగ్నోస్టిక్స్ సంస్థ ద్వారా ఇంటి వద్దనే హోల్టర్, ఎబిపిఎం టెస్టులు చేపించుకోవచ్చని హెల్త్ వాచ్ టెలి డయాగ్నోస్టిక్స్ సిఈవో ఎస్.సెంథిల్ కందీపన్ తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇటీవల హైదరాబాదులో తమ సంస్థ సేవలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. వైద్యులు, రోగులు ఇద్దరూ ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ఏర్పాటు చేశామని తెలిపారు. ఆసుపత్రులు, క్లినిక్‌లు, వైద్య నిపుణులు వంటి ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను, సరసమైన ధరలతో యాక్సెస్ చేయవచ్చని, ఫలితాలు వెంటనే పొందవచ్చని పేర్కొన్నారు. దేశంలోని విశాఖపట్నంతో సహా 75 కంటే ఎక్కువ నగరాలకు భాగస్వాముల నెట్ వర్క్ ద్వారా పరీక్షలను అందిస్తున్నట్లు తెలిపారు.

అమెజాన్ పే లేటర్‌తో ఏకీకరణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అమెజాన్ బిజినెస్ వినియోగదారులను అమెజాన్ పే లేటర్‌తో ఏకీకరణ చేస్తున్నామని సంస్థ బిజినెస్ డైరెక్టర్ సుజిత్ సుభాష్ తెలిపారు. గురువారం బీచ్ రోడ్ లోని గేట్ వే హోటల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 10 లక్షలకుపైగా విక్రేతలలో రూ.19 కోట్లకు పైగా జిఎస్‌టితో అమెజాన్ బిజినెస్ ఈ రోజు దేశవ్యాప్తంగా 99.5 శాతం పిన్ కోడ్స్‌కు సేవలు అందిస్తోందని తెలిపారు. కస్టమర్లకు వర్చ్యువల్ క్రెడిట్ కేటాయించడానికి అమెజాన్ పే లేటర్‌తో తాము సమీకృతమవుతున్నామని పేర్కొన్నారు.

తెలుగు అందమైన భాష : విజయబాబు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ప్రపంచంలోని భాషలలో తెలుగు అందమైన భాష అని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషా అభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షులు పి.విజయబాబు అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖలలో తెలుగు భాషా అమలు తీరుపై గురువారం ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి వెంకటలక్ష్మి, ఎంపిపి శ్రీదేవి

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలం తామరపల్లి పంచాయతీ ఈతలపాడు గ్రామంలో జెడ్పీ నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, ఎంపీపీ బంధం శ్రీదేవి, మండల కన్వీనర్ జల్లెపల్లి రామన్నదొర, జెసిఎస్ కన్వీనర్ పండా రామకృష్ణ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ గతంలో పలుమార్లు గ్రామానికి వచ్చిన సమయంలో ఈ రోడ్డు దుస్థితిని చూసి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఎంపీటీసీ వంశీ కుంజం మాట్లాడుతూ తమ పంచాయతీ రోడ్డు మంజూరు చేసిన జెడ్పీటీసీకి గ్రామస్తులు, పంచాయతీ నాయకుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ మిర్తివాడ ఆనంద్ రెడ్డి, వైస్ ఎంపీపీ కోమ్మిశెట్టి బాలకృష్ణ, వార్డు సభ్యులు కూర వెంకన్న, గోపాల్, సచివాలయం కన్వీనర్ సారపు బాపిరాజు, అబ్బులు, గృహ సారథులు చిరంజీవి, బాపన్నదొర, వైసిపి నాయకులు బంధం ఆనంద్ రావు, బాపిరాజు, పండా నాగన్న, చితుకులరెడ్డి, రవణ, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గత ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఎపి ఆదివాసీ జెఎసి వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పాదయాత్ర, ఎన్నికల సమయంలో మెగా డిఎస్‌సి ప్రకటిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు గడిచినా ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా భర్తీ చేయలేదన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాలలో ఏకోపాధ్యాయునితో ప్రభుత్వ పాఠశాలలు నడుస్తున్నాయని తెలిపారు. ప్రతి ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ ప్రకటించి ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేస్తామన్న చెప్పిన మాటలు నీటి మూటలగానే మిగిలాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వాలని, ఐటీడీఏలకు ప్రత్యేక ఏజెన్సీ డిఎస్సిని ప్రకటించి రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం స్థానిక ఆదివాసీ పట్టభద్రుల అభ్యర్థులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

డిగ్రీ కళాశాలలో పరిసరాల పరిశుభ్రత



మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు

ప్రజాశక్తి-చింతూరు :స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం (ఎన్ఎస్ఎస్) ప్రోగ్రాం ఆఫీసర్ జి.హారతి ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో గురువారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. కళాశాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను, పొదలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

హాట్‌లైన్‌లో సాంకేతిక లోపాల సవరణ

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు జల విద్యుత్ కేంద్రం స్విచ్ యార్డ్ నుంచి విద్యుత్ సరఫరా చేసే 220 కెవి హాట్ లైన్లో సాంకేతిక లోపాలను సవరించారు. ఈ లోపాలను కనుగొనేందుకు విజయవాడ హాట్ లైన్స్ సిబ్బంది రెండు రోజుల నుంచి విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ క్రమంలో 220 కెవి విద్యుత్తు లైన్లో సాంకేతిక లోపాలు కనుగొని వాటిని సవరించారు. మరికొన్ని సాంకేతిక లోపాలు స్థానిక ఏపీ జెన్కో ఇంజనీర్లు సరి చేశారు. హాట్ లైన్స్ సిబ్బంది థర్మా విజన్ కెమెరాలతో లోపాలు తనిఖీ చేసి వాటిని సవరించేందుకు చర్యలు చేపట్టారు.

జల విద్యుత్ కేంద్రం రెండో యూనిట్ ఐస్ లీటరు లింబో ఒక పక్కకు ఒరిగిపోవడంతో పెను ప్రమాదం సంభవిస్తుందని హాట్ లైన్స్ సిబ్బంది గుర్తించారు. దానిని తొలగించారు. ప్రతి ఏడాది హాట్‌లైన్ సిబ్బంది విద్యుత్ లైన్‌లో లోపాలు కనుగొనేందుకు వస్తుంటారు. విద్యుత్ సరఫరా జరుగుతుండగానే సాంకేతిక లోపాలు సవరించడం వీరి ప్రత్యేకత. హాట్ లైన్స్ సిబ్బంది, స్థానిక ఏపీ జెన్కో ఇంజనీర్లు లోపాలను పూర్తిస్థాయిలో సవరించినట్లు ఏడిఇ శ్రీకాంత్ వెల్లడించారు.



సాంకేతిక లోపాలు సవరిస్తున్న హాట్ లైన్స్ సిబ్బంది.

ఎయుతో శ్రీలంక వర్సిటీ అధికారుల చర్చలు



వర్చువల్‌గా చర్చల్లో పాల్గొన్న ఎయు అధికారులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం అధికారులతో శ్రీలంకకు చెందిన శ్రీజయవర్ధన విశ్వవిద్యాలయం అధికారులు సమావేశం అయ్యారు. వర్చువల్ విధానంలో నిర్వహించిన సమావేశంలో ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాద రెడ్డి,రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆచార్య పి.డి.సత్యపాల్, డాక్టర్ హెచ్.పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. శ్రీలంకలోని శ్రీ జయవర్ధన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎం.పద్మలాల్, పాలి-బుద్దిస్ట్ స్టడీస్ విభాగాధిపతి ఆచార్య ఎం.విజితానందలు పాల్గొన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం పాలి-బుద్దిస్ట్ స్టడీస్ అంశంలో ఎం.ఏ కోర్సును ప్రారంభించే దిశగా అవగాహన ఒప్పందం(ఎంఓయూ) చేసుకోవడానికి సన్నాహకంగా ఈ సదస్సు నిర్వహించారు. రెండు విశ్వవిద్యాలయాలలో వసతులు, కోర్సు నిర్వహణకు సాధ్యాసాధ్యాలను చర్చించారు. కార్యక్రమానికి డాక్టర్ నిమాలి తక్షిల సమన్వయం చేసారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి- గాజువాక : ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని యుటిఎఫ్ గాజువాక ప్రధాన కార్యదర్శి సబ్బారపు నూకరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ, ప్రభుత్వం కేబినేట్ సమావేశంలో సిపియస్‌ను రద్దు చేస్తూ జిపియస్‌కు ఆమోదముద్ర వేయడం దారుణన్నారు. జిపిఎస్ ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమోద యోగ్యం కాదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులంతా వ్యతిరేకిస్తున్న సిపిఎస్ రద్దుచేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీని అమలు చేయకుంటే ఆందోళన చేయక తప్పదని హెచ్చరించారు.

సైబర్ సెక్యూరిటీపై పోర్టు ఉద్యోగులకు గీతం వర్క్‌షాప్

ప్రజాశక్తి- మధురవాడ : విశాఖ పోర్టు ఉద్యోగులకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో గురువారం సైబర్ సెక్యూరిటీపై ప్రత్యేక వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. విశాఖ పోర్టు ఛీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పిఎస్ఎల్.స్వామి, పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నరేంద్రప్రసాద్, డీన్ ప్రొఫెసర్ టి.విజయశేఖర్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.శిరీష హాజరయ్యారు. రెండు రోజులు పాటు జరిగే ఈ వర్క్‌షాప్‌లో ఆన్‌లైన్ భద్రత, సంస్థకు సంబంధించిన, వ్యక్తిగత సమాచారం భద్రతలో పాటించాల్సిన మెలకువలను వివరించారు. మొబైల్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ సెక్యూరిటీ, హ్యాకర్‌ల బారిన పడకుండా తీసుకోవ లసిన జాగ్రత్తలపై గీతం ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ జి.లక్ష్మీశ్వరి, కె.సందీప్ వర్మ, ఎ.యశ్వంత్‌ల పర్యవేక్షణలో పోర్టు ఉద్యోగులకు అవగాహన కల్పించారు.


పోర్టు ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న గీతం ప్రతినిధులు

బాలిక అదృశ్యం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని అమీనాబాద్ కాలనీ గ్రామానికి చెందిన గోకిరి దుర్గా భవాని (16) అనేక బాలిక అదృశ్యమైనట్లు జడ్డంగి ఎస్సై రఘునాధరావు గురువారం తెలిపారు. దుర్గా భవాని ఈ నెల 19న ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, కుటుంబీకులు బంధువులు ఇళ్ల వద్ద వెతికిన కనిపించలేదని పేర్కొన్నారు. అదే గ్రామానికి చెందిన ఒక యువకుడితో వెళ్లి ఉండవచ్చని అనుమానంతో బాలిక అమ్మమ్మ గురువారం జడ్డంగి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

23న సిపిఐ సమావేశం

ప్రజాశక్తి-కొయ్యూరు : సిపిఐ మండల సమితి సమావేశం ఈనెల 23న మండలంలోని కించలిలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి ఇరవాడ దేముడు, నాయకులు వియ్యపు నానాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జీవీ సత్యనారాయణమూర్తి, అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ పాల్గొంటారని పేర్కొన్నారు.

డ్వాక్రా మహిళలకు ఆటోలు మంజూరు

ప్రజాశక్తి-కొయ్యూరు : గిరిజన ఉప ప్రణాళిక (టిఎసిపి) నిధులతో ఎస్టీ, ఎస్సీ డ్వాక్రా మహిళలకు ఆటోలు అందజేస్తున్నట్లు వెలుగు ఏపీఎం శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు 10 శాతం రూ.33,519 చెల్లించాలని, నేరుగా ఆటోను కొనుగోలు చేసి ఇస్తామని పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీ లోగా వెలుగు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు గ్రూపు పొదుపు పుస్తకం తీసుకురావాలని ఆయన సూచించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం 33/11 కెవి సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 22న శుక్రవారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు రంపచోడవరం, ఫాక్స్ పేట, గెడ్డాడ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఇఇ ఎండి.యూసఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరంచాలని ఆయన కోరారు.

ఎయు ప్రొఫెసర్‌కు జాతీయ పురస్కారం

ప్రజాశక్తి- విశాఖపట్నం :ఆంధ్రవిశ్వవిద్యాలయం సంగీత విభాగం సీనియర్ ఆచార్యురాలు సరస్వతీ విద్యార్థికి ప్రతిష్టాత్మకమైన భారతరత్న డాక్టర్ ఎంఎస్ సుబ్బలక్ష్మి సంగీత ప్రాచార్య అవార్డు లభించింది. ఈ నెల 16న ముంబాయిలో సుబ్బలక్ష్మి జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీ షణ్ముఖానంద సంగీత సభలో పద్మవిభూషణ్ డాక్టర్ ఆర్.చిదంబరం, పద్మవిభూషణ్ ఆచార్య మన్మోహన్ శర్మ నుంచి ఆచార్య సదస్వతీ విద్యార్థి ఈ పురస్కారాన్ని స్వీకరించారు. భారతీయ శాస్త్రీయ సంగీతానికి చేస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేసారు.అవార్డుతో పాటు రూ లక్ష నగదు పురస్కారాన్ని అందించారు. దీనిని నగరానికి చెందిన త్యాగరాజ ఆరాధన ట్రస్ట్‌కి విరాళంగా ఆచార్య సరస్వతీ విద్యార్థి అందజేసారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందిని, ఏయూలో సంగీత విభాగ వికాసానికి మరింత కృషిచేస్తామన్నారు.


అవార్డు గ్రహీతను అభినందిస్తున్న ఎయు విసి

అవార్డు గ్రహీతకు అభినందన

ఏయూ ఆచార్యురాలు జాతీయ స్థాయిలో పురస్కారాన్ని అందుకోవడం పట్ల ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో గురువారం ఆచార్య సరస్వతీ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఇటువంటి అవార్డులు విశ్వవిద్యాలయం ప్రతిష్టను ఇనుమడింపచేస్తాయన్నారు. ఏయూ సంగీత విభాగం జాతీయ స్థాయిలో ఎంతో ప్రఖ్యాతి చెందిందని, దీనిని మరింత వృద్ధి చేసే బాధ్యత విభాగ ఆచార్యులు, విద్యార్థులు స్వీకరించాలన్నారు. వర్సిటీ పరంగా విభాగానికి సంపూర్ణ సహకారం, తోడ్పాటును అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.